- : www.aknu.edu.in
- : nannayavani@aknu.edu.in
- : nannayanewstv
- : Adikavi Nannaya University
- : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
**ఆచార్య మొక్కా జగన్నాథరావు**
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
**ఆచార్య తుపాకుల అశోక్**
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 9 | 28-11-2022 | పుటలు : 4


శిఖరాగ్రాలను చేరుకోవాలంటే అన్నిటిని ఎదుర్కొనే ధోరణి కూడా చాలా అవసరం అవుతుంది. కర్తవ్య నిష్ఠ, సంకల్పం, నిజాయితీ, శ్రమ, సాధన అనేవి ఎదుర్కొనే ధోరణికి దోహదం చేస్తాయి. ఇది నిజం. యాపిల్ పండు క్రిందకే ఎందుకు పడుతుంది? అని ఒక పెద్దాయన ప్రశ్నించాడు. అప్పటికున్న ప్రపంచం వేరు. ప్రశ్నించిన తర్వాత ప్రపంచం వేరు. ఆ ప్రశ్నలోంచి అన్వేషణలు, ఆవిష్కారాలు మొదలయ్యాయి. అర్జునుడు తన ప్రశ్నలతో కృష్ణుడు కొన్ని సమాధానాలు చెప్పే దిశను కల్పించాడు. దానినే మనం భగవద్గీత అంటున్నాం. జ్ఞానులతో కలసి నడిచేవారు జ్ఞానాన్ని సంపాదించుకుంటారని అంటుంది బైబిల్. మనం పని చేస్తున్న సంస్థ గొప్పదయ్యే కొద్దీ మనం కూడా గొప్పవాళ్ళం అవుతాం. ఒక్క అడుగుతోనే ప్రయాణం మొదలవుతుందనే సూక్తి అందరికీ తెలుసు. ఆలోచన కూడా అంతే. కేవలం ఒక్క ఆలోచనతోనే గొప్ప గొప్ప మార్పులు కలుగుతుంటాయి. మనం మన ఆలోచనలు ఏ మార్పునైనా తీసుకురాగలవు. ఇవాళ మన శ్రమతో, సాధనలతో, విద్యార్థుల విజయాలతో, శ్రేయస్సును కోరే వారి సహకారంతో NAAC గుర్తింపు లభించింది.ఈ గుర్తింపుతో విశ్వవిద్యాలయానికి కొత్త శకం మొదలైంది.

# నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ B+ గ్రేడ్

### నన్నయ చరిత్రలోనే తొలిసారిగా నాక్ గుర్తింపు సాధించాం

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**23.11.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ National Assessment and Accreditation Council (NAAC) B+ గ్రేడ్ సాధించామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రకటించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో బుధవారం ఏర్పాటు చేసిన టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ జగన్నాథరావు నాక్ గ్రేడ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ చరిత్రలోనే తొలిసారిగా నాక్ గుర్తింపును సాధించామని, విశ్వవిద్యాలయ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజన్నారు. విశ్వవిద్యాలయానికి నూతన శకం ప్రారంభమైందని విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి పథంలో పయనించ నుందన్నారు. తాను వీసీగా బాధ్యతలు

2 లో..


















## సంపాదకీయం



# సంకల్పం

సవ్యమైన మనోదృక్పథం కలిగిన వ్యక్తులకి లక్ష్యసాధనలో ఏ శక్తీ అడ్డుపడలేదంటారు థామస్ జెఫర్సన్. సంకల్పం సరైనదైతే విజయాలు సంప్రాప్తిస్తాయి. సమష్టి కృషి ఆటంకాలను ఎదుర్కొంటూ ముందుకు సాగిపోతుంది. వాస్తవానికి విజయమనేది ఒక మానసిక స్థితి. మనం విజయాన్ని కోరుకుంటూనే మనల్ని మనం, మన కార్యాచరణలని విజయాలుగానే భావిస్తుంటాం కూడా. కార్యశీలురు, కర్తవ్యనిష్ఠ కలిగిన వాళ్లు ఈ ప్రపంచాన్ని ఆశావాదమనే అద్దంలోంచి చూస్తుంటారు. మరికొందరు అదే ప్రపంచాన్ని నిరాశావాదం అని అద్దంలోంచి చూస్తారు.

నేను చేస్తాను, చేయగలను, నా దగ్గర పరిష్కారం ఉంది, ఈ పని పూర్తి చేయడానికి మార్గముంది... అనే వ్యక్తులు ఇతరుల్లో మంచితనాన్ని వెతుకుతారు. వాళ్ళు సుసాధ్యాలనే చూస్తారు. వాళ్ళు అనుకున్నది సాధిస్తారు.

ఆశావాదం అనే అద్దం మీద దుమ్ము పేరుకుంటూ ఉంటుంది. దానిని శుభ్రం చేస్తూ ఉండాలి. కించపరచడం, తిరస్కరించటం, నిరాశ నిస్పృహలు, సందేహాలు, బురద చల్లడం వంటి వాటితో అది మురికి పడుతుంది. దానిని నిరంతరం శుభ్రం చేస్తూనే ఉండాలి. అప్పుడే ఆ అద్దంలో నుంచి శక్తివంతమైన విజయ కిరణాలు ప్రసరించి గొప్ప కాంతినిస్తాయి. ఆ కాంతిలో ఆ విజయం దర్శనమిస్తుంది. వెలుగులో ఏది కలిసినా వెలుగే.

ఇవాళ ఒక కొత్త కాంతిశకం మొదలైంది. వంద ఎకరాల వెలుగుబంద ప్రాంతంలో నన్నయ విశ్వవిద్యాలయం విద్యా పరీమళాలతో వెలుగులీనుతోంది. నన్నయ విగ్రహ స్థాపనతో మొదలైన ఈ ప్రాంతం ఒక పుష్కర కాలంలో రోడ్లు, భవనాలు, తరగతి గదులు, వసతి గృహాలు,కేంద్ర గ్రంథాలయం,ఆడిటోరియం.... ఇలా వరుసగా అన్నిటిని సమకూర్చుకుంటూ ముందుకెళ్తుంది. *12 B* స్టేటస్, *AICTE, ISO* గుర్తింపులను సమకూర్చుకుంది. ఇవాళ మొదటి ప్రయత్నంలో *NAAC B+* గ్రేడును పొందింది.

వ్యక్తుల సంకల్పాలు, సిబ్బంది సమష్టి కృషి, విద్యావేత్తల సహకారం, గోదావరి జిల్లా ప్రజల ఆశయాలు, విద్యార్థుల ఉత్సాహం..."ఇది మన విశ్వవిద్యాలయం!" అనే ఆత్మీయ సంస్పర్శ, చాళుక్యుల ప్రతీకలు, నన్నయ ఆశీస్సులు.... ఇవన్నీ కలిస్తే విశ్వవిద్యాలయ గుర్తింపు, విజయాలు!!

ఈ సరస్వతీ నిలయానికి,విద్యా సేవలందిస్తున్న వ్యవస్థకి సహృదయంగా సహకారమందిస్తున్న అందరికీ నన్నయవాణి కృతజ్ఞతలు అందిస్తోంది.

**సింధువునుచేరి బిందువు సింధువగును!**

**ధ్యేయమునుబట్టి ప్రతిపని దివ్యమగును!!**

## మంచి మాట

సత్యం సమాజానికి తలవంచదు. సమాజమే సత్యానికి తలవంచాలి.

*Truth does not pay homage to any society. Society has to pay homage to Truth.*

- స్వామి వివేకానంద



# నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ B+ గ్రేడ్

**(మొదటి పేజీ నుంచి)** స్వీకరించిన నాటి నుండి నాక్ గుర్తింపును సాధించాలనే దృఢ సంకల్పంతో పని చేసానని తెలిపారు. దీనిలో భాగంగా కోవిడ్ సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటూ నాక్ సాధనకు అవసరమైన డాక్యుమెంటేషన్ ను సిద్ధం చేసామని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి వరుసగా ఐ.ఎస్.ఓ., ఎ.ఐ.సి.టి.ఇ., గ్రీన్ ఆడిట్, ఎనర్జీ ఆడిట్, జెండర్ సెన్సిటిజేషన్ వంటి గుర్తింపులతో పాటు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి అరుదైన రికార్డులను సాధించామని తెలిపారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయ చరిత్రలోనే తొలిసారిగా నాక్ గుర్తింపును సాధించడం విశేషమన్నారు. ఈ నెల 15,16,17 తేదీలలో నాక్ పీర్ టీమ్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలను విజిట్ చేసారన్నారు. విశ్వవిద్యాలయంలోని వనరులు, వసతులు, విద్య, పరిశోధన, ప్రయోగశాలలు, ప్రయోగాత్మక కార్యక్రమాలు, నాణ్యత ప్రమాణాలు వంటివి పరిశీలించారని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల కాలంలో చేపట్టిన బెస్ట్ ప్రాక్టీసెస్ పై నాక్ పీర్ టీమ్ సంతృప్తిని వ్యక్తం చేసారని తెలియజేసారు. నాక్ సాధనకు కృషి చేసిన కోఆర్డినేటర్ ఆచార్య కె. శ్రీరమేష్, ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, క్రైటీరియా హెడ్స్, సభ్యులను అభినందనలు తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తొలిసారిగా సాధించిన నాక్ B+ గ్రేడ్ ను ఆధారం చేసుకొని భవిష్యత్ లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి నాక్ B+ గుర్తింపు రావడం హర్షనీయమని అన్నారు. నాక్ గుర్తింపుకు సహకరించిన విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తరువాత నాక్ ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.ఎం.కమలకుమారి, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, డీన్స్ డా.పి.వెంకటేశ్వరరావు, డా.డి.జ్యోతిర్మయి, యూనివర్సిటీ ఇంజనీర్ డా.కె.నూకరత్నం, ఎస్.లింగారెడ్డి లు నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు రావడంపై తమ అభిప్రాయాలను తెలియజేసారు. నన్నయకు నాక్ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో కృషిచేసిన వీసీ జగన్నాథరావును విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో మతసామరస్య వారోత్సవం




ఆల్ ఇండియా ఉమెన్స్ కౌన్సిల్ మరియు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మతసామరస్య వారోత్సవాలను క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కమలకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఐ. దోసగిరిరావు పాల్గొని విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో ఉన్న మతపరమైన విభేదాలు, ఒక మంచి సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది వాటిని ఏ విధంగా నిర్మూలించాలనే విషయాలపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పిదప ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ చారిత్రక వైభవాన్ని దీనికి ఉన్న ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ డా. కమల కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సమాజంలో ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులైనటువంటి ఈ యువభారతాన్ని ఎంతగానో ప్రభావితం చేసి ఒక మంచి సమాజ ఏర్పాటుకి దోహదపడుతుందని, అలాగే తన మన భేదం లేకుండా భిన్నత్వంలో ఏకత్వం అనే అంశాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఎంతగానో ఉందని, ఇటువంటి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం చేయడం హర్షనీయమన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా ఉమెన్ కౌన్సిల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐడబ్ల్యుసి సెక్రటరీ భానుమతి, ట్రెజరర్ పద్మజ, ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతశ్రీ, డా. ఎం. పోచయ్య , క్యాంపస్ ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.అనిలాంబిక, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతిఒడిలో ఎంబీఏ ఓపెన్ ఎయిర్ క్లాస్



దుళ్ళ గ్రామంలో ఓపెన్ ఎయిర్ క్లాస్ లో విద్యార్థులు

కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది రెండు పర్యాయాలు నిర్వహించే ఓపెన్ ఎయిర్ క్లాసులను ఈసారి దుళ్ళ గ్రామంలోని కందారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. మానవ మనుగడలో ప్రకృతిపాత్రపై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మేనేజ్మెంట్ ఎక్స్, వై థీరీలను బోధించారు. మేనేజ్మెంట్ విభాగ ఆచార్యులు ఎస్.టేకి కోఆర్డినేటర్ గా వ్యవహరించి పలు కీలక విషయాలను విద్యార్థులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మేనేజ్మెంట్ విభాగాధ్యాపకులు డా.ఉమమహేశ్వరి, డా.ఎన్.ఉదయభాస్కర్, అధ్యాపకులు మరియు 83 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## నన్నయ భారతికి పుస్తకాలు బహూకరణ



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నన్నయభారతి దాతలు సమర్పించిన పుస్తకభాండాగారానికి అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ సభ్యులు పుస్తకాలను బహూకరించారు. రాష్ట్ర పర్యటనలో పలువురు ప్రముఖులను కలుసుకుంటూ వస్తున్న బృదం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నన్నయ భారతి కో ఆర్డినేటర్ డా.తలారి వాసును శనివారం కలుసుకుని, ఖలీఫా అబ్రజత్ మిర్జా మస్రూర్ రచించిన ' ప్రపంచ సంక్షోభం- శాంతి మార్గం ' పుస్తకాల్ని అందజేశారు. జిల్లా యూత్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్ అహ్మద్ , మహ్మద్ అక్బర్ తదితరులు వెంట ఉన్నారు.

# ఉపకులపతి ఉవాచ

## అందరికీ నమస్కారం! కృతజ్ఞతలు!!



2020 జనవరిలో ఉపకులపతి బాధ్యత తీసుకున్న తర్వాత మార్చి నెలనుండి కోవిడ్ సంక్షోభం మొదలైంది. అయినప్పటికీ ఆన్లైన్ విద్యా సేవల ద్వారా సుమారుగా 100కు పైబడి వెబినార్లను నిర్వహించుకోగలిగాం. అలా నిర్వహించి కోవిడ్ నిశ్శబ్దాన్ని చేదించగలిగాం.వెబినార్స్ నిర్వహణకు పురస్కారాలు రావడం సంతోషాన్ని కలిగించింది.

కోవిడ్ అనంతరం విశ్వవిద్యాలయానికి ISO, AICTE గుర్తిం పులను తీసుకురావడానికి సంకల్పించుకున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ నాక్ గ్రేడ్ సమకూర్చుకోవాలనేది మన ముందున్న ముఖ్యమైన లక్ష్యం. ఈ మూడు సంవత్స రాల్లో కోవిడ్ పరంగా, ఇతర ఆటంకాల పరంగా ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికినీ మనందరం సమష్టి కృషితో అనుకున్నది సాధించుకోగలిగాం. ముఖ్యంగా అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అంతా నాకు పూర్తి సహకారాల్ని అందించారు.

ఈ వారంలో నాక్ పీర్ టీం విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వివిధ వ్యవస్థలను గమనించి, నూతనంగా ఏర్పాటు చేసిన అనేక అంశాలను పరిశీలించి వారి సంతృప్తిని వ్యక్తం చేశారు. మనకు NAAC B+ గ్రేడ్ లభించింది.

ఒక సమన్నతమైన సంకల్పం వెనుక విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులు, విద్యావేత్తలు, శ్రేయోభిలాషులు, గోదావరి జిల్లా ప్రజల ఆశయానికి సంబంధించిన ఆశీస్సులు మనకందాయని భావిస్తున్నాను.

ముఖ్యంగా AICTE, ISO, NAAC ఈ మూడు లక్ష్యాలను పూర్తి చేయాలని అనుకోవడం నా కర్తవ్యంగా భావించాను. అనుకున్న లక్ష్యాలనుపూర్తి చేసినందుకు ఎంతో సంతృప్తిగా ఉంది. దానికి మీరందరూ సంపూర్ణ సహకారాన్ని అందించినందుకు మీ అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ధన్యవాదాలతో....

- ఆచార్య మొక్కా జగన్నాథరావు

# ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ

**26.11.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డా.బి.ఆర్ అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ ప్రతి(నమూన) వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత రాజ్యాంగం యొక్క పీఠికను విశ్వవిద్యాలయ అధ్యాపకుల, మరియు విద్యార్థులచే చదివింప చేసారు. ఈ కార్యక్రమంలో ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం యొక్క ఔన్నత్యాన్ని, రాజ్యాంగ రచనకు కృషి చేసిన రాజ్యాంగ రూపకర్తలను కొనియాడారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని ముందుకు తీసుకువెల్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన తాతినేని మెహర్ ప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యంగం గొప్పతనాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమలో ఇన్ ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సురేష్ వర్మ, ఒఎస్డి ఆచార్య ఎస్.టేకి, ఐ.క్యూ.ఎ.సి కోఆర్డినేటర్ డా.స్వామి, ఆచార్య డా.డి.జ్యోతిర్మయి, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.పి.వెంకటేశ్వరరావు సహాయ గ్రంథాలయాధికారి డా.టి.సింహాచలం, లాయర్ పద్మావతి అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.


రాహుల్‌ని సన్మానిస్తున్న విసి జగన్నాథరావు

**రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాలు**

నన్నయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచన మేరకు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కృషి చేసారు. దీనిలో భాగంగా నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లోని భారత రాజ్యాంగ ప్రవేశికను విద్యార్థులందరితో చదివించాలని ఆదేశాలు జారి చేసారు. నన్నయ విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో "ఇండియా థ మధర్ ఆఫ్ డెమోక్రసి" అనే అంశంపై యూనివర్సిటీ సెమినార్ హాల్ లో అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఛార్టెడ్ అకౌంట్ రాహుల్ వేదంతం ఉపన్యసించారు. విలువైన సందేశాన్నిచ్చిన రాహుల్ ను వీసీ జగన్నాథరావు సన్మానించి,అధ్యాపకులు జె.సూరయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, కోర్సు కోఆర్డినేటర్ డా.కె.యామినిజోష్న, డా.బి.వి.బాలకృష్ణ, డా.ఎన్.రాజశేఖర్, జె.సూరయ్య పాల్గొన్నారు.


కాకినాడలో..

**కాకినాడ క్యాంపస్ లో**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్, కాకినాడ నందు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ వారు ఇండియా ద మదర్ ఆఫ్ డెమోక్రసీ అనే అంశం జరిగిన సమావేశంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ డా.ఎం.పోచయ్య అధ్యక్షత వహించి క్యాంపస్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.వి. కృష్ణారావు, సీనియర్ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాస్ భారత రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎం.నానిబాబు, డా.బి.హరిబాబు, డా.గోపి వివిధ విభాగాధిపతులు బోధన బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని భారత రాజ్యాంగ ప్రవేశికని ప్రతిజ్ఞ చేశారు.

**తాడేపల్లిగూడెం క్యాంపస్ లో రాజ్యాంగ దినోత్సవం**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతి డిపార్ట్మెంట్ విద్యార్థి, డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ప్రాముఖ్యతను, ఆయన బోధించిన నైతిక విలువలను మరియు వెనుకబడిన తరగతుల సమానత్వం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరమేష్ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులందరూ చురుగ్గా పాల్గొని భారత రాజ్యాంగంలోని నీతి, నైతికత, ప్రమాణాలను అర్థంచేసుకొని మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను గొప్పతనాన్నికొనియాడారు.



తాడేపల్లిగూడెంలో..

# వాటర్ డిస్పెన్సర్‌లను బహూకరించిన మెహర్ ప్రసాద్


మెహర్ ప్రసాద్ ను అభినందిస్తున్న వీసీ

**26.11.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నన్నయభారతి, సైకాలజీ విభాగాలకు రెండు వాటర్ డిస్పెన్సర్ లను సైకాలజీ పూర్వవిద్యార్థి తాతినేని మెహర్ ప్రసాద్ బహూకరించారు. శనివారం నన్నయభారతి డోనెటెడ్ వింగ్ లో వాటర్ డిస్పెన్సర్ లను బహుకరించిన మెహర్ ప్రసాద్‌ను వీసీ జగన్నాథరావు అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సైకాలజీ పూర్తి చేసిన మెహర్ ప్రసాద్ విశ్వవిద్యాలయానికి పలు వస్తువులను బహుకరిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని అన్నారు. మెహర్ ప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకొని విశ్వవిద్యాలయంపై కృతజ్ఞత భావాన్ని కలిగి ఉండాలని, విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గోదావరి జిల్లాల ఉన్నత విద్యాకేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయ అభివృద్ధికి గోదావరి జిల్లాల్లోని సహృదయం కలిగిన దాతలంతా ముందుకు వచ్చి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, నన్నయభారతి కోఆర్డినేటర్ డా.తలారివాసు, ఫ్యాకల్టీ అసోసియేట్ డా.రాజరాజేశ్వరిదేవి, సైకాలజీ కోర్సు కోఆర్డినేటర్ డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, డా.పి.రాజశేఖర్, డా.సిహెచ్.ఎన్.కె.భవాని పాల్గొన్నారు.

# సౌత్ జోన్ బ్యాడ్మింటన్‌కు నన్నయ ఎంపిక

**25.11.22 (మీడియాసెల్)**

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ (మెన్) పోటీలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రీడాకారులు ఎంపికయ్యారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో వీసీ జగన్నాథరావు బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందించి వివరాలను తెలియజేసారు. జైన్ యూనివర్సిటీ బెంగళూర్ లో నవంబర్ 27 నుండి 30వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ (మెన్) పోటీలకు నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు ఎంపికయ్యారని అన్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో చక్కని ప్రతిభ కనపరచిన క్రీడాకారులు సౌత్ జోన్ పోటీలకు హాజరవుతారని చెప్పారు. ఈ పోటీలలో విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి ఎ.వంశీకృష్ణరాజు(సి.ఆర్.రెడ్డి కాలేజ్ ఏలూరు), ఆర్.శశికిరణ్ నాయుడు(సి.ఆర్.రెడ్డి కాలేజ్ ఏలూరు), ఎ.ఎస్.గుణశేఖర్ (ఎస్.డి.వి.ఆర్.ఆర్.డి. కాలేజ్ కోలంక), ఎన్.నాగిరెడ్డి(డి.ఎల్.ఆర్.డిగ్రీ కాలేజ్ జి.మామిడాడ), జి.ఆకాష్(మా కామర్స్ అండ్ సైన్స్ తణుకు), జె.వై.దుర్గాప్రవీణ్(డి.ఎల్.ఆర్.డిగ్రీ కాలేజ్ జి.మామిడాడ), ఎస్.వసంతరాయుడు(పి.ఆర్.కాలేజ్ కాకినాడ) క్రీడాకారులు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి కోచ్ కం మేనేజర్ గా డి.ఎన్.ఆర్ డిగ్రీ కాలేజ్ భీమవరం డా.బి.నరసింహరాజు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా.బి.రాంగోపాల్, పీడీ ఎ.సత్యనారాయణ, డా.బి.నరసింహరాజు పాల్గొన్నారు.


బ్యాడ్మింటన్ క్రీడాకారుల జట్టుతో వీసీ జగన్నాథరావు

# ఆదివాసీ సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి



నేషనల్ సెమినార్ ను ప్రారంభిస్తున్న అతిథులు




సెమినార్ లో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు




సెమినార్ లో మాట్లాడుతున్న డా.రూప్ నారాయణ్ జి.మంద్వే

**22.11.22 (మీడియాసెల్)**

భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన ఆదివాసీ సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ (NCST) మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా విద్యాకళాశాల ఆధ్వర్యంలో “భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజన వీరులు” అనే అంశంపై నేషనల్ సెమినార్ ను యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, విశిష్ట అతిథిగా మెంబర్ ఆఫ్ ఎన్.సి.ఎస్.టి న్యూఢిల్లీ డా.రూప్ నారాయణ్ జి.మంద్వే హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వాతంత్రోద్యమంలో ఆదివాసి సమరయోధుల పాత్రలను ప్రతిబింబిస్తూ రూపొందించిన చిత్ర ప్రదర్శన అందరిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమైనదని, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన అనేక నిరసనలకు ఆదివాసీ వీరులు నాయకత్వం వహించారని అన్నారు. గిరిజనుల హక్కుల కోసం వారు చేసిన పోరాటం విప్లవంగా మారడాన్ని భారతదేశం చూసిందన్నారు. గిరిజన ప్రతిఘటన ఉద్యమం భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అంతర్భాగమన్నారు. ఈ చారిత్రాత్మక పోరాటంలో కొమరంభీమ్, రామ్ జీ గోండు, బిర్సాముండా, రాణి గైడిన్లియు, లక్ష్మణ్ నాయక్, వీర్ సురేంద్రసాయి, వంటి వారు ఎంతో విరోచితంగా పోరాటం చేసారన్నారు. అటువంటి వీరుల స్పూర్తితో విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలన్నారు. గిరిజనులు అన్ని రంగాల్లోను ముందుండాలని, విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలన్నారు. తరువాత ఎన్.సి.ఎస్.టి న్యూఢిల్లీ డా.రూప్ నారాయణ్ జి.మంద్వే మాట్లాడుతూ ఎన్.సి.ఎస్.టి న్యూఢిల్లీ ప్రతిపాద చేసి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సంస్కృతికి మూలం ఆదివాసీలేనని ఆదివాసీల చరిత్ర, సాంస్కృతిక విశేషాలను తెలియజేసారు.ఎందరో విదేశీయులపై ఆదివాసీలు పోరాటాలు చేసారని తెలిపారు. రాజ్ శంకర్, రాజ్ రఘునాథ్ లు భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాటం చేసిన తొలి ఆదివాసీలని అన్నారు. చారిత్రక అంశాలను అవగాహన చేసుకుంటూ భావితరాలకు స్పూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. కన్వీనర్ డా.ఆర్.ఎస్.వరహాలదొర మాట్లాడుతూ నేషనల్ సెమినార్ ఏర్పాటుకు సహకరించిన వీసీ జగన్నాథరావుకు, ఎన్.సి.ఎస్.టి వారికి కృతజ్ఞతలు తెలియజేసారు. తరువాత నిర్వాహకులు అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన జానపద నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డా.పి.విజయనిర్మల, ప్రినిపాల్ డా.కె.సుబ్బారావు, కన్వీనర్ డా.ఆర్.ఎస్.వరహాలదొర, ఎం.సన్యాసినాయుడు, ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ డా.దేవకొండ వెంకటేశ్వర్లు, మర్రి సుధాకర్, కోకన్వీనర్స్ డా.ఎల్.మధుకుమార్, డా.రాజ్ కుమార్, కృష్ణ, విద్యాకళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.









విద్యార్థుల గిరిజన జానపద నృత్య ప్రదర్శనలు

## ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు ఎంపికైన నన్నయ విద్యార్థులు




**21.11.22 (మీడియాసెల్)**

వెస్ట్ జోన్ ఎన్.ఎస్.ఎస్ ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ 2022 కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. యూనివర్సిటీలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విద్యార్థులను అభినందించి వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్ సెలక్షన్స్ కు రెండు వందల మంది విద్యార్థులు హాజరయ్యారని వారిలో ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి వెస్ట్ జోన్ ఎన్.ఎస్.ఎస్ ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ 2022 సర్దార్ పటేల్ యూనివర్సిటీ గుజరాత్ పంపిస్తున్నామన్నారు. వీరిలో యు.చంద్రమౌళి (ఆదిత్య కాలేజ్ రాజమండ్రి), ఎం.రమేష్ (వై.ఎన్.కాలేజ్), కె.బాబి (ఆదిత్య కాకినాడ), బి.లతామల్లేశ్వరి (ఎస్.కె.ఎస్.డి.తణుకు), కె.అనిత (ఆదిత్య,తుని), వై.భువనేశ్వరి(ఎస్.కె.ఆర్.ఉమెన్స్ రాజమండ్రి) ఎంపికయ్యారన్నారు. వెస్ట్ జోన్ ఎన్.ఎస్.ఎస్ ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ 2022కు ఎంపికైన విద్యార్థులు చక్కని ప్రతిభ కనపరచి విశ్వవిద్యాలయ ఔన్నత్యాన్ని మరింత పెంచాలన్నారు. విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేసి దేశ రాజధాని ఢిల్లీలో రిపబ్లిక్ డే 2023 కార్యక్రమంలో నన్నయ విద్యార్థులు ఎంపిక కావాలని సూచించారు.

## వీసీని అభినందించిన నన్నయ నాన్ టీచింగ్ స్టాఫ్



వీసీ జగన్నాథరావు గారిని సన్మానిస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్

**24.11.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు సాధించిన ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారిని యూనివర్సిటీ నాన్ టీచింగ్ వెల్ ఫేర్ అసోసియేషన్ అభినందించారు. గురువారం విశ్వవిద్యాలయ వీసీ కార్యాలయంలో వీసీ జగన్నాథరావును కలిసిన నాన్ టీచింగ్ సిబ్బంది సన్మానించి అభినందించారు. గొప్ప విద్యావేత్తగా విశ్వవిద్యాలయ ప్రగతిని నిత్యం ఆకాంక్షించే జగన్నాథరావు కృషి ఫలితంగా విశ్వవిద్యాలయానికి తొలిసారిగా నాక్ గుర్తింపు వచ్చిందన్నారు. విశ్వవిద్యాలయ చరిత్రలో మొక్కా జగన్నాథరావు గారి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వీసీ జగన్నాథరావు గారికి నాన్ టీచింగ్ సభ్యులందరి సహాయసహకారాలు ఉంటాయని అసోసియేషన్ సెక్రటరీ ఎం.ప్రతాపరెడ్డి, మాజీ సెక్రటరీ సలాది శ్రీనివాసరావు లు కొనియాడారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పని చేసే సిబ్బంది అంతా విశ్వవిద్యాలయ అభివృద్ధిని ఆకాంక్షించాలని, అప్పుడు విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధిని సాధిస్తుందన్నారు. నాన్ టీచింగ్ సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in